# రూమ్ నంబర్ 117

మెస్ గంట కోసం ఎదురు చూస్తున్న భాస్కరం వాచీ చూసి చూసి అలసి పోయాడు. ఏడున్నరకే ఆకలి వేస్తోంది. పొద్దున్న కాఫీ మూడు సార్లు తాగి (ఆ వెధవ పంతులుగాడి వల్లే), మధ్యాహ్నం ఒంటి గంటకు కాస్త కతికాడు. లైబ్రరీకి పోయి పుస్తక లోకంలో మైమరచి పోయాడు. తీరా హాస్టల్ కి వచ్చాక ప్రారంభమయింది ఆకలి. గంట విన్న మరుక్షణం ఒక్క ఉదుటన మెస్ లోకి జొరబడ్డాడు. తనకు ఇష్టమైన చామ్ఫ్రై. వండర్ ఫుల్ గా ఉంది. పక్క వాళ్లతో మాటాడడానికి ఇది సమయం కాదు. గబగబా లాగించి ఇవతల పడ్డాడు తన రూమ్ మేట్స్ పంతులుగాడు, శేషగిరి ఇంకా భోజనాలకి వెళ్లడానికి తయారవుతున్నారు. వీళ్లు తిరిగి వచ్చేసరికి తనో చాప్టర్ పూర్తి చేద్దామని టెక్స్ట్ బుక్ ఆఫ్ జనరల్ సర్జరీ తీశాడు. ఓపది నిమిషాలు చదవాడో లేదో, తలుపు శబ్దం. మిత్రుడు భవానీ శంకరం. నిట్టూర్చాడు భాస్కరం, ఇక చదువింతేలే అన్నట్టు.

"ఏరా! ఎక్కడా కనపడ్డం లేదు?" కుశల ప్రశ్న.

"నీకేం? టౌన్ లో ఉన్నావ్ పుట్టింట్లో. మాకీ హాస్టల్ మెతుకులే గతి ... అయినా, ఈ వెధవ జీవితం ఎవడు కనిపెట్టాడో, వెధవ తిండి, వెధవ బతుకు. పోనీ, చదువుకుందామంటే ఎప్పుడూ ఏదో గోల"

"అదంతా పాత పురాణమేగాని మార్కులెలా వస్తున్నాయ్?"

"ఏదో, ఓమాదిరి."

"ఈ మధ్యేమైనా సినిమాలు చూశావా? ఎప్పుడూ పుస్తకాల గొడవేనా? మంచి ఘోస్ట్ స్టోరీ. లీలామహల్ లో వస్తావా?"

"ఏమిటోయ్ అది?" పంతులు ప్రవేశించాడు.

"ఏం నాయనా, షికారు కెళ్లలేదా?" కసిగా అడిగాడు భాస్కరం. తననీ తిప్పుతున్నందుకు కక్ష.

పంతులు వెనకాలే సిగరెట్టు కాల్చుకుంటూ వచ్చాడు జాన్. యూనివర్సిటీలో పారాసైకాలజీ విద్యార్థి. విపరీతంగా పుస్తకాలు చదువుతాడు. కబుర్లు రాయుడు. కథలిట్టే అల్లేస్తాడు. పంతులికి మహా స్నేహితుడు.

"ఏమిటోయ్ ఆ ఘోస్ట్ స్టోరీ?" పంతులు ఆ టాపిక్ వదలడానికి ఇష్టపడ లేదు.

"ఏదో సినిమాలే. ఇంతకీ జాన్ పారాసైకాలజీ వాడు కదా - ఇ.ఎస్.పి. పారానార్మల్ మానిఫెస్టేషన్స్ - ఇలాంటివి నమ్ముతాడా?" భవానీకి సందేహం వచ్చింది.

"ఎంతమాట! నాకు అలాంటి కథలన్నా సినిమాలన్నా చాలా ఇష్టం ఆ సమయానికి జ్ఞాపకం వచ్చింది - చాలా సంవత్సరాల క్రిందట ఈ హాస్టల్‌లోనే కాశీపతి అనే ఒక స్టూడెంట్ ఉండేవాడట. మీరెప్పుడైనా విన్నారా?"

"ఎవరా కాశీపతి, ఏమా కథ?" భవానీకి గాసిప్ అంటే మహా ఇష్టం. కథలంటే పిచ్చి.

భాస్కరానికి సంభాషణ తీరు నచ్చలేదు 'పిల్ల దుంపతెగ మరి, చదువుకోనిచ్చేటట్టు లేరే!' లోలోపలే గునుసుకున్నాడు.

"కాశీపతి మా అన్నయ్య విక్టర్ క్లాస్ మేట్."

"కాకినాడలో ప్రాక్టీస్ చేస్తున్న విక్టర్ మీ అన్నయ్యా?" భవానీ శంకరం ఎందుకో చాలా ఆశ్చర్యం ప్రదర్శించాడు.

"అవును. కాశీపతి కథ చాలా భాగం మా అన్నయ్యే నాకు చెప్పాడు."

"ఇంతకీ ఏమా కథ?" భవానీ ఊరుకోలేదు.

డ్రమెటిక్‌గా మరో సిగరెట్టు ముట్టించి ప్రారంభించాడు జాన్.

"మా అన్నయ్య, కాశీపతి రూమ్ మేట్స్. నూట పదిహేడో గదిలో ఉండే వాళ్లట. కాశీపతి ఓ విషాద గాథకి కథానాయకుడు.

ఇప్పటికీ మా అన్నయ్య మాటలే జ్ఞాపకం వస్తాయ్" ... గతంలోకి పొయ్యాడు జాన్.

"కథ కానీయ్." కాలరిడ్జి పద్యంలో ఏన్షియంట్ మారినర్‌కి కథ చెప్తేస్తేనే గాని నరకయాతన తగ్గదు. ఈ భవానీగాడికి కథ వినేస్తేనే గాని ఆరాటం ఆరదు.

"కాశీపతి ఆర్థడాక్స్ బ్రాహ్మిన్ ఫామిలీలో పుట్టాడు. కష్టపడి చదివే వాడు. మొండి పట్టు మనిషి. మొదట అతను నూట పదిహేడో గదిలో దిగడానికి సందేహించిన మాట మాత్రం వాస్తవేమేనట. కాని, అన్నయ్యా, అతనూ గొప్ప స్నేహితులు. దయ్యాలేమిటి నాన్సెన్స్ అనేశాడు అన్నయ్య. ఇద్దరూ దిగారు ఆ గదిలో. ఈ సంఘటన వాళ్లు ఫిఫ్త్ ఇయర్‌లో ఉండగా జరిగిందిట. ఉన్నట్టుండి కాశీపతి మారిపోయాడు. ఎవరితోనో ప్రేమాయణంలో పడ్డాడని వినికిడి. అన్నయ్య మాత్రం అతన్నెప్పుడూ వెనకేసుకు వచ్చేవాడట గొప్ప లాయల్టీతో.

"సుమారు ఇరవై ఏళ్ల కిందటి విషయం. కాశీపతి గదిలో దయ్యం ఉందని ప్రచారం అయింది. హాస్టల్ కాంపౌండులో వేపచెట్టు కింద ఎముక తెచ్చుకుని గదిలో ఉంచాడనీ, ఆ ఎముక ఒక భగ్నప్రేయసిదనీ, ఆ ఎముకతో పాటు దయ్యం సాక్షాత్కరిస్తుందనీ, ఆమె పట్టిన మనిషి రెండు మూడు రోజుల్లో చనిపోవడం ఖాయమనీ అనుకుంటూ ఉండే వారు. కాశీపతి ఈ ఎముక కథ చాలా సార్లు విన్నాడు. ఉన్నట్టుండి ఓ ఎముకను తన గదిలో తెచ్చి పెట్టుకున్నాడు." జాన్ కొంచెం ఆగాడు — రియాక్షన్స్ కోసం కాబోలు.

".మెడిసన్ చదువుతూ ఎముకలు దగ్గరుంచుకోవడంలో ఆశ్చర్యమేముంది? ఇక్కడ మా ప్రతి ఒక్కడి కప్‌బోర్డ్‌లోనూ అవి ఎప్పుడూ ఉండేవే. మా దృష్టిలో అవి మనిషి ఎముకలు మాత్రమే కావు. శాస్త్రజ్ఞానంతో పరికించవలసిన స్పెసిమన్స్. ఇంతకీ ఏమిటి నీకథ సారాంశం?" భాస్కరం విసుక్కున్నాడు.

"నేనూ ఈ కథ విన్నప్పుడే అలాగే అనుకున్నాను. మన హేతువాదం సంగతి తరువాత ఆలోచిద్దాం ..." జాన్ ఇంకా ఏదో చెప్పబోయాడు.

"ఇంతకీ కాశీపతి గదిలోకి దయ్యం వచ్చిందా?" భవానీకి క్యూరియాసిటీ ఆగలేదు.

"వచ్చిందని నువ్వెందు కనుకున్నావ్?" ఎదురు ప్రశ్న వేశాడు జాన్.

"అయితే, జాన్, దయ్యాలుంటాయా?" పంతులు గాడడిగాడు.

"దయ్యాలను చూసిన వాళ్లులేరు. ఇకపోతే కొన్ని కొన్ని సంఘటనలు మాత్రం పారానార్మల్ మానిఫెస్టేషన్స్ అని కొంత మంది ఒప్పుకున్నారు. వీటిని నిదర్శనాలు చూపడం కష్టమే."

"ఇంతకీ ఇప్పుడు కాశీపతి ఎక్కడున్నాడు?" మరోలా ప్రశ్న వేసి చూశాడు పంతులు.

"ఇంకెక్కడి కాశీపతి? హౌస్ సర్జన్సీ అవుతున్నప్పుడే చనిపోయాడు."

"అయితే, కాశీపతిని దయ్యం చంపిందా?" భవానీ నోరు కెళ్ల బెట్టాడు.

"కాశీపతి చనిపోయిన కారణం ఊహించడం కష్టమేమీకాదు. కాని, దయ్యం విషయం మాత్రం వింతగా ఉంటుంది. మా అన్నయ్య నాకంటె చాలా పెద్దవాడు. మా వయస్సులోని వ్యత్యాసం వల్ల నేను యూనివర్సిటీలో చేరే వరకు ఎక్కువ సేపు మా అన్నయ్య ఎదుటబడే వాడిని కాదు. ఒక రోజు కాశీపతి ప్రస్తావన ఎందుకో వచ్చింది. అన్నయ్య సడన్‌గా ఓ రిమార్క్ పారేశాడు –

"జాన్, చెడ్డకు నరకం ఎక్కడో లేదు ఈ ప్రపంచంలోనే ఉంది" అని.

"ఏమిటన్నయ్యా, కాశీపతి అంత చెడ్డవాడా?"

"అతని గురించి చాలా మందికి నిజం తెలియదు. నువ్వూహిస్తే సంతోషమే" కొంచెం నసిగి మళ్లీ ప్రారంభించాడు.

"ఆ రోజుల్లో – మేము మెడికల్ కాలేజీలో చదివే రోజుల్లో ఇంకా విద్యార్థులు కొంచెం ఛాందసంగానే ఉండేవారు. సంఘం ఇంత పెర్మిసివ్‌గా ఉండేది కాదు."

"ఇంతకూ కాశీపతి ఏమయ్యాడు?" భవానీ మళ్లీ అడిగాడు.

"మిత్రులు అతన్ని గురించి ఏమనుకున్నా, అన్నయ్యకు మాత్రం కాశీపతంటే గౌరవం. ఇంకా పోతే జాలి. ఒకనాడు వాళ్లద్దరి సంభాషణా ఇలా సాగింది.

అన్నయ్య:- ఒరేయ్, కాశీపతీ! నీ గురించి వాళ్లంతా ఏమోమో చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా ఆ దయానిధిగాడు. వాడికి దయ్యాలంటే భయం. నువ్వేమో ఎవరో అమ్మాయితో తిరుగుతున్నావని ఏవేవో కూస్తున్నాడు. పైగా అమ్మాయి కిరస్తానీ అనీ, నిన్ను వలలో వేసుకోవడానికి ప్రయత్నం చేస్తోందనీ ఈ గొడవంతా ఎందుకూ, ఆ ఎముక పారేసి వాణ్ణి కాస్త శ్లాకేట్ చెయ్యకూడదూ?

కాశీపతి :- నీ మొహం! వాడి దుష్ప్రచారం ఆపెయ్యడానికి నేను ఎముక పారెయ్యాలా? ఇంపాసిబుల్. దయ్యాలంటే నాకు భయం లేదు. ఇకపోతే, నాదగ్గర ఎముక ఉంటే వాడికేం? వాడి ఉట్టి ఫానటిక్. వాడి మాటలు నమ్మకు. ఈ వేళ సినిమాకి వెళ్లాలి. సరస్వతీలో కొత్తదొచ్చిందిట నువ్వెళ్లి టిక్కెట్టు తీసుకుని ఉండు, నేవచ్చేస్తా.

అన్నయ్య సినిమా దగ్గర కాశీపతి కోసం చాలా సేపు చూశాడు. ఇంక వాడి సూచన కనబడక మరో స్నేహితుడితో వెళ్లి ఒంటి గంటకు రూమ్‌కి వచ్చాడు. తలుపు తట్టగానే కాశీపతి తలుపు తీసి వెంటనే వెళ్లి ముసుగు తన్ని పడుకున్నాడు. గదంతా మల్లెపూల వాసన. అన్నయ్య మంచం మీద కూడా ఏదో సెంటు వాసన ... నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అన్నయ్య సీరియస్‌గా చెప్పుకు పోతున్నాడు.

తెల్లవారిన తరువాత కాఫీకి మెస్సు కెళుతూ ఉంటే దయానిధి కనబడ్డాడు. "కాఫీ తాగిన తరువాత నా రూమ్‌కి వస్తారా విక్టరుగారూ?" మర్యాదగానే ఆహ్వానించాడు.

కొంతసేపయాక దయానిధి అడిగాడు. "నిన్నరాత్రి మీ కాశీపతి ఏం చేశాడో తెలుసా?"

"నేను సినిమాకు వెళ్లాను. ఏం, ఏం జరిగింది?"

"నాథియరీ రైటు. నిన్న రాత్రి మేం అంతా లౌంజిలో కూర్చున్నాం. రాత్రి పది గంటలయింది. ఏదో లోకాభి రామాయణం మాట్లాడు కుంటూండగా ఎక్కడి నుంచో మల్లెపూల వాసన, మత్తెక్కించే సెంటు వాసన గుబాళించడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎక్కణ్ణుంచో తెలుసుకోకుండా ఉండలేక పోయాం. వాసన మీరూమ్ వద్ద నుంచే వస్తున్నట్లు తెలుసుకోవడానికి మాకు అట్టే సేపు పట్టలేదు. సుందరావ్ గది దగ్గరకు వచ్చేసరికి మీ గదిలో ఏదో చిత్రమైన వ్యవహారం జరుగుతున్నట్టు ఊహించాం. (మర్డర్ కేస్ ఇన్‌వెస్ట్‌గేట్ చేస్తున్న సి.ఐ.డి. అనుమానితుణ్ణి దంచేస్తున్నట్టు దంచేస్తున్నాడు) గదిలోని అద్భుత సౌరభం వేసి ఉన్న తలుపుల్లోంచి బ్లాకంతా అలుము కుంటూంది మగ పిల్లల హాస్టల్స్‌లో ఆడ పిల్లలు, సువాసనలు అతి విశేషం. (ఆ రోజుల్లో). అందుకు వచ్చిన నలుగురితోనూ చెప్పాను. ఓ కాస్సేపు తర్జనభర్జన చేసి మీ రూమ్ తలుపు తట్టాం. ఇంకా వాసన దట్టంగానే ఉంది. కాశీపతి తలుపు తీశాడు. నేలోపలికెళ్ల లేదనుకోండి. ఉగ్రుడై కాశీపతి "జస్ట్ ల్‌ట్ మి ఎలోన్ ... యూ గెట్ ఔట్, ఆల్ ఆఫ్ యూ!" మీరైనా చెప్పండి విక్టర్‌గారూ, ఆ ఎముక పారెయ్యమని.

అన్నయ్యకు విషయం బోధపడలేదు. ఇంకా వివరాలు కావలిస్తే ఎవరివ్వగలరు? సుందరావ్ దగ్గరికి వెళ్లాడు. వాసన మాత్రం నిజమేననీ, లోపల స్త్రీ కంఠం తన భావన అయితే అయి ఉండవచ్చునని అన్నాడు సుందరావ్. అన్నయ్య కేం చెయ్యాలో తెలియలేదు.

అన్నయ్య రూమ్‌కి వచ్చేసరికి కాశీపతి మంచం మీద కూర్చు న్నాడు. మనిషి ఏదో పోగొట్టు కున్నవాడిలా దిగులుగా ఉన్నాడు. అన్నయ్యే కదిపాడు మెల్లగా. "ఏం కాశీపతి, నువ్ చెప్పావ్ కదా అని యూనివర్సిటీలో డాన్స ప్రోగ్రాం మానుకుని, సినిమా వద్ద చూశాను నీకోసం. నేను గదిలో ఉంటే ఈ గొడవ వచ్చేది కాదు."

"సారీ, విక్టర్. ఇదంతా నారాత. నేను ఈ వ్యవహారం ఇంత ముదురుతుందని అనుకోలేదు. ఇక దీని విషయం మరచిపో. ప్లీజ్! మరి దీని గురించి నాతో ప్రస్తావించకు."

అన్నయ్య ఏం అనలేక పోయాడు. వాసన వ్యవహారం తెలిసిన వాళ్లు మాత్రం దయ్యాలకు దూరంగా ఉండటం మంచి దనుకున్నారు. కొన్ని రోజులు పోయిన తరువాత మరో సంఘటన జరిగిందట.

ఆరోజు బ్లాకులో ఎక్కువ మంది ఎందుకనో లేరు. ఓ నలుగు రైదుగురు మాత్రం రేడియో వింటూ కూర్చున్నారుట. మళ్లీ వాసన. తోటి విద్యార్థులు మరి ఆగలేక పోయారు. ఒక్క ఉదుటన పరిగెట్టి నూట పదిహేడు వైపు రాసాగారు. వీళ్లు చూస్తుండగానే గది తలుపులు తెరుచుకున్నాయి. ఒక స్త్రీ ఆకారం. తెల్లని చీర, పొడుగాటి జడ, జడ నిండా మల్లెలు. కుర్రాళ్లు రావడం చూసి వెనక్కి తిరిగి అటు పక్క మెట్ల వెంబడి దిగిపోయింది. ఆమెను వెంబడించాలని ఎవరికీ ఊహ కలగ లేదు. కళ్ల ముందు దయ్యం. కెవ్వున కేక వేశా డొకడు. తలుపులు తెరచే ఉన్నాయ్. కాశీపతి మాత్రం మంచాన్ని కరచి పట్టుకున్నట్లు పడుకున్నాడు."

"అయితే దయ్యానికి, కాశీపతికి సంబంధం ఏమిటి? అతని చావుకు దయ్యం కారణమా?" నాకూ అడగాలనే అనిపించింది. కాని, అన్నయ్య ఆలోచనలకు అంతరాయం కలిగించడం నాకిష్టం లేదు.

భవానీ శంకరం కూడా ఆలోచనలో పడ్డాడు. ఏదో ఆలోచిస్తు న్నాడు. దయ్యాల కథలు వింటున్నప్పుడు ప్రతి వారికీ వారి వారి జీవితాల

లోని దయ్యాలకు సంబంధించిన సంఘటనలు జ్ఞాపకం రావడం కద్దు. "నిజంగా దయ్యాలుంటాయా? కాశీపతి గదిలోకి వచ్చిందెవరు?" భవానీ అడిగాడు.

"నర్స్ మిస్ మార్టరీ. దయ్యాన్ని ఇప్పటి వరకూ ఎవ్వరూ పది మందిగా చూడడం జరగలేదు. విద్యార్థులంతా చూశారని అన్నయ్య కథనం. ఇందులో ఏదో రహస్యం ఉంది. అన్నయ్య ఏదో దాచడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఇది దయ్యం కాదు. సొంతంగా దీన్ని వాకబు చెయ్యాలని అన్నయ్య మరో క్లాస్‌మేట్ చక్రధర్ దగ్గరికి వెళ్లాను. ఇప్పుడతను రాజమండ్రిలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. కాలేజ్‌లో ఫైనల్ చేరడానికి వస్తూ రాజమండ్రిలో దిగా.

మాటల మధ్య యథాలాపంగా వాళ్ల క్లాస్‌మేటు, కాశీపతి ప్రస్తావన తెచ్చాను. కాశీపతి మాటవిని ఫక్కున నవ్వాడు చక్రధర్. నాకు నిజంగానే కోపం వచ్చింది. నా మొహంలో సీరియస్‌నెస్ చూసి అతనే అన్నాడు.

"సారీ! నిల్ నిసీ బోనమ్ అని మీరు చనిపోయిన వాళ్ల గురించి చెడ్డగా మాట్లాడరుకదూ? కాని, కాశీపతి మమ్మల్నంతా శద్ధవల్ని చేసి ఆడించాడు. మీ అన్నయ్య గొప్ప లాయల్టీతో కాశీపతిని కవర్ చేశాడు. మీ అన్నయ్యే అతన్ని అకామడేట్ చెయ్యకపోతే అసలు కాశీపతి ఆటలు సాగేవి కావు."

"మిమ్మల్ని ఫూల్ చెయ్యడానికి తను చచ్చిపోయాడా?" కొంచెం విసుకుగానే అడిగాడు చక్రిధర్‌ని.

"అతని చావు మాకందరికీ విచారాన్ని కలిగించింది. అతను మమ్మల్ని ఎంత ఫూల్ చేసినా. కాని, అతని ప్రవర్తనకీ, అతని చావుకూ ఏ మాత్రం సంబంధం లేదు."

"అంటే?"

"అతను ల్యూకేమియా, అంటే బ్లడ్ కాన్సర్ వల్ల చనిపోయాడు. అది ఘోరమైన జబ్బు. అప్పటికీ, ఇప్పటికీ దానికి మందు లేదు." నాకు కొంచెం విసుగు అనిపించింది. మీ డాక్టర్లందరకీ ఉన్న జబ్బే ఇది. ఒకలా మాట్లాడక మహా సీరియస్‌గా ప్రొఫెషనల్ ఫేస్ పెట్టేస్తారు. కొంచెం కదిల్చామా, వ్యాధుల గురించి, ఇటియాలజీ, ప్రోగ్నోసిస్, ట్రీట్‌మెంట్ దంచేస్తారు వినేవాళ్లుండాలి గాని.

"అతను ల్యూకేమియాతో చనిపోయాడని అన్నయ్య చెప్పాడు."

"అంతేనా? అసలు సంగతి చెప్పలేదూ?"

"అందుకే మీ దగ్గరకు వచ్చాను." మరి ముంత దాచలేదు.

మీ అన్నయ్య లాయల్టీ అమోఘం. (చిరునవ్వు) అసలు జరిగిన సంగతి ఇది. నీకు తెలుసేమో అనుకున్నాను. మిస్ మార్జరీ అనే నర్సుకీ, కాశీపతికి పరిచయమయి, చిక్కపడి ప్రేమాయణంలో పడింది. కాశీపతి బ్యాక్‌గ్రౌండ్ తెలిసిన దయానిధికి ఈ ప్రేమాయణం చాలా అసహ్యంగా ఉండేది. కాశీపతీ, మార్జరీ ఎక్కడ కలిసేవాళ్లో మాకు తెలియదు. కాని, రెండు సార్లు హాస్టల్‌లో, మీ అన్నయ్య గదిలోనే వాళ్లు హుషార్ చేసినట్లు మాకందరికీ తెలుసు. దాని కోసం కాశీపతి ఆడిన నాటకం అద్భుతం.

ఏదో ఓ ఎముక కథను చెప్పుకుంటూ ఉండేవారు. ఆ ఇడియట్ దయానిధిగాడు దాన్ని కొంత వరకూ నమ్మాడు. మీ అన్నయ్యకు దయ్యాల మీద నమ్మకం లేదు. కాశీపతి నాటకమాడుతూంటే మీ అన్నయ్య సైలంట్‌గా ఉండటానికి కారణాలు – మొదటిది: కాశీపతీ, తనూ చాలా దగ్గర స్నేహితులు. రెండవది : మిస్ మార్జరీ క్రిస్టియన్. మూడవది : తన గదిలోనే ఇది జరుగుతున్నట్లు అంతా అయిపోయే వరకూ తెలియదు. ఇంతకీ ఇప్పుడతను చనిపోయిన తన స్నేహితుని గురించి చెడు చెప్పడు."

"మిత్రులంతా వాళ్ల గదిలో ఉన్నప్పుడు తలుపు తడితే, లేదూ, ఆ అమ్మాయిని వెంబడిస్తే ..." మళ్లీ ప్రారంభించాడు జాన్. "ఇలాంటి ప్రశ్నలకు మనకు సమాధానం తెలియదు. మాక్జిమం ఏం జరిగేదీ వార్డెన్‌కు తెలిసేది. సస్పెండ్ అయి ఉండేవాడు కాశీపతి."

మెల్లగా లేచాడు జాన్.

"మేమూ వస్తాం బస్‌స్టాప్ వరకూ"

అని పంతులూ, భాస్కరం, భవానీ, జాన్ వెంబడి నడిచారు. నూట పదిహేడో గదికి కొంచెం ముందుగానే అద్భుతమైన అగరువత్తుల వాసన వేసింది. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. పంతులు చొరవ చేసి గది తలుపు తట్టాడు మెల్లగా. కొంచెం సేపటి తరువాత మెల్లగా తలుపు తెరుచుకుంది. ముగ్గురూ లోపలి కెళ్లారు. జాన్ మాత్రం బయటే ఉన్నాడు. ఒక పెద్ద సాయిబాబా పటానికి పెద్ద పూలమాల వేసి ఉంది. ముందు అగరు వత్తులు గది నిండా సువాసన.

"సారీ మిస్టర్ సత్యం ... నువ్వు పూజలో ఉన్నావని మాకు తెలియదు – రేపు ఎలక్షన్లకి ..." ఏదో అబద్ధం ఆడాడు పంతులుగాడు.

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
10–7–74